# ప్రజాశక్తి

ఆదివారం 13 జులై 2025

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

# అనకాపల్లికి జ్వరమొచ్చింది!

- ఎన్‌టిఆర్, ప్రయివేటు ఆసుపత్రులకు రోగుల రద్దీ



**ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్**

అనకాపల్లి జిల్లాలో జ్వరాలతో బాధపడే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుంది. సీజనల్, వైరల్ జ్వరాలు వేగంగా వ్యాపిస్తున్నాయి. కొన్ని రోజులుగా ఎన్‌టిఆర్ జిల్లా ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరగడంతోపాటు ప్రయివేటు ఆసుపత్రుల్లోనూ అధిక సంఖ్యలో రోగులు చేరుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడం, వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. జలుబు, దగ్గు, తలనొప్పి, కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు తదితర లక్షణాలతో రోగులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. వీటిలో అధికభాగం వైరల్ జ్వరాలకు సంబంధించినవే ఉంటున్నాయి.

ఎన్‌టిఆర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోజుకు సగటున 800 నుంచి 1000 మంది వరకు అవుట్ పేషెంట్ రోగులు వస్తున్నారు. ఇందులో సుమారు 60శాతం మంది జ్వరాల సమస్యలతో బాధపడుతున్నట్లు ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఎక్కువగా జ్వరాల బారిన పడుతున్నారు. వారికి రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల వైరల్ ఇన్ఫెక్షన్లు బారిన పడుతున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు.

జిల్లాలోని ప్రముఖ ప్రయివేటు ఆసుపత్రుల్లోనూ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కొన్ని ఆసుపత్రుల్లో బెడ్లు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. రోగుల సంఖ్య గత వారం రోజుల్లో రెట్టింపు అయింది. కొందరిలో డెంగీ, టైఫాయిడ్ లాంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. సకాలంలో వైద్యాన్ని తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

జ్వరాల నుంచి రక్షణ పొందాలంటే వ్యక్తిగత శుభ్రత పాటించాలని, మురుగు నీటి నిల్వలను తొలగించాలని, తాగునీటిని మరిగించి తాగాలని, తగినంత విశ్రాంతి మిగతా 2లో..



స్టీల్‌ప్లాంట్ పైలాన్ చుట్టూ వేసిన ముళ్ల కంచె

# దీక్షలపై 'ఉక్కు'పాదం

## కూర్చొనే అవకాశం లేకుండా పైలాన్ చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటు

**ప్రజాశక్తి-ఉక్కునగరం :** స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలపై పాలకులు, యాజమాన్యం ఉక్కుపాదం మోపుతోంది. కూలిపోయిన దీక్షా శిబిరాన్ని పునరుద్ధరించే ప్రయత్నం చేసిన కార్మికులను కూటమి ప్రభుత్వం పోలీసులతో అడ్డగించింది. టెంట్ లేకపోయినా న్యూ పైలాన్ వద్ద గొడుగులతో ధైర్యంగా కొంత మంది ఉద్యోగులు, రిటైర్ ఉద్యోగులు ఇప్పటి వరకు నిరసన కొనసాగిస్తున్నారు. దీన్ని కూడా సహించలేని యాజమాన్యం గురువారం సాయంత్రం మెటల్ ముళ్ల తీగలను పైలాన్ చుట్టూరా వేసింది. పైలాన్ ప్రాంతంలోకి వెళ్లే అవకాశం లేకుండా కూటమి ప్రభుత్వం, యాజమాన్యం కార్మిక వ్యతిరేక బుద్ధి చూపించాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన దీక్షా శిబిరం పునరుద్ధరించుకోవడానికి ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ వేశారు. యాజమాన్యం 4600 మంది కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించింది. ఉద్యోగులకు ఇప్పటికీ 3నెలల జీతాల బకాయి ఉంది. ఉద్యోగులందరిపైనా పనిభారం పెరిగింది. విధులకు హాజరు కావాలంటేనే భయపడాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నారు. జీతాలు, అలవెన్సులకు కోత పెట్టారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆధ్వర్యాన నడుస్తున్న విశాఖ విమల విద్యాలయాన్ని ఇప్పటికీ తెరవలేదు. ఈ విధమైన చర్యలతో యాజమాన్యం, కూటమి ప్రభుత్వం ముందుకెళ్తున్నాయి. ఈ నిరంకుశ విధానాలను తీవ్రంగా ఖండించాల్సిన అవసరముందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### టిడిఆర్ బాండ్లను ఐక్యంగా వ్యతిరేకిద్దాం : సిపిఎం

వార్త మెయిన్ 2లో..

### 14న ఎపిఎల్ సీజన్-4 క్రీడాకారుల వేలం

వార్త మెయిన్ 3లో..

### ఏడాది పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం : బొత్స

వార్త మెయిన్ 3లో..



నియామకపత్రాలను అందిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

# రోజ్‌గార్ మేళాలో 52 మందికి నియామక పత్రాలు

**ప్రజాశక్తి - సీతమ్మధార :** విశాఖపట్నంలోని కైలాసపురంలోని సాగరమాల కన్వెన్షన్స్‌లో ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ ఈస్ట్ కోస్ట్ రైల్వే ద్వారా శనివారం రోజ్‌గార్ మేళా నిర్వహించారు. రైల్వేలు, తపాలా శాఖ, హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, యూనియన్‌బ్యాంక్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ వంటి వివిధ మంత్రిత్వ శాఖలు/విభాగాల్లో ప్రభుత్వంలో చేరనున్న 52 మందికి కేంద్ర పౌరవిమానయాన మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, యువత సాధికారత, శ్రామిక శక్తి అభివృద్ధికి వివిధ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్‌కుమార్‌సాహూ, ఎడిఆర్ఎం (ఇన్‌ఫ్రా) శాంతారామ్, బ్రాంచ్ అధికారులు, యూనియన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ రంగ సంస్థల పటిష్టతకు సూచనలు

## పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్

**ప్రజాశక్తి-విశాఖపట్నం :** రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలను పటిష్టపరచడమే లక్ష్యంగా అవసరమైన సూచనలను ప్రభుత్వానికి చేస్తామని ఎపి.లెజిస్లేచర్‌కు చెందిన పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ చెప్పారు. రాష్ట్రంలోని కొన్ని ప్రభుత్వ రంగసంస్థలు కొన్నేళ్లుగా ఆడిట్ నివేదికలను, వార్షిక నివేదికలను అసెంబ్లీకి సమర్పించడం లేదనే విషయాన్ని తమ కమిటీ సమీక్షలో గుర్తించామన్నారు. రెండు రోజులపాటు విశాఖపట్నంలో జరిపిన పర్యటనలో 12 సంస్థల కార్యకలాపాలపై సమీక్షించి వాటి పనితీరు, నిర్వహణ, ఆయా సంస్థల ఆడిట్ గురించి తెలుసుకున్నామని తెలిపారు. ప్రతి సంస్థ తమ కార్యక్రమాలను ప్రతి ఏటా ఆడిట్ చేయించి ఆ నివేదికలను తదుపరి సంవత్సరంలో అసెంబ్లీకి సమర్పించాల్సి ఉంటుందన్నారు. పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ సమావేశాలు 2009 తర్వాత ఇప్పుడే జరుగుతున్నాయని చెప్పారు.

జిల్లాలో రెండు రోజులపాటు ప్రభుత్వరంగ సంస్థల ఉన్నతాధికారులతో పూర్తిస్థాయిలో సమీక్షలు జరిపిన కమిటీ తమ సమీక్షల్లో గుర్తించిన అంశాలను శనివారం కలెక్టర్ కార్యాలయంలో కమిటీ సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు, వర్ల కుమార్ రాజాలతో కలసి నిర్వహించిన మీడియా సమావేశంలో కమిటీ కూన రవికుమార్ వెల్లడించారు. రాష్ట్రంలో 178 ప్రభుత్వరంగ సంస్థలు ఉన్నాయని, ఈ సంస్థలన్నింటి కార్యకలాపాలపై తమ కమిటీ సమీక్షిస్తుందని చెప్పారు. ప్రభుత్వ రంగసంస్థల నుంచి పూర్తి సమాచారాన్ని రప్పించేందుకు అమరావతిలో రాష్ట్ర స్థాయిలో మరో సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూన రవికుమార్

**రెండో రోజు ఆరు సంస్థలపై కమిటీ సమీక్ష**

రెండో రోజు కలెక్టర్ కార్యాలయంలో మరో ఆరు ప్రభుత్వ సంస్థలపై సమీక్షించింది. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, ఎపి.మెడ్ వ్యాలీ, బయో వ్యాలీ, గిరిజన సహకార సంస్థ, ఏపీ అపెరల్ పార్కు, ఆర్టీసీ తదితర సంస్థ కార్యకలాపాలు, ఆర్థిక నివేదికలపై కూన రవికుమార్ ఆధ్వర్యాన సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కాంట్రాక్టర్ ఐజాక్ బాషా, ఎమ్మెల్యేలు నడికుదిటి ఈశ్వరరావు, ఆర్‌విఎస్‌కె.రంగారావు, అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ, వర్ల కుమార్ రాజా తదితరులతో కలసి సమీక్షించారు. సమావేశంలో కమిటీ సంయుక్త కార్యదర్శి పివి.సుబ్బారెడ్డి, విఎంఆర్‌డిఎ సంయుక్త కమిషనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి..**

## అనకాపల్లికి జ్వరమొచ్చింది!

తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. జ్వర లక్షణాలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.

**సకాలంలో వైద్యం చేసుకోవాలి**

వాతావరణ మార్పులతో సీజనల్ జ్వరాలు ఎక్కువయ్యే అవకాశం ఉంది. ఇటీవల కాలంలో ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువ పడ్డాయి. మైదాన ప్రాంతంతో పోలిస్తే అక్కడ ఎక్కువే. జ్వరం, దగ్గు, జలుబు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలి.

**- డాక్టర్ కృష్ణారావు**
**ఎన్టీఆర్ ఆసుపత్రి సూపరింటెండెంట్, అనకాపల్లి**

## డ్రగ్స్ నగరంగా విశాఖ : వాసుపల్లి

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** అబద్దాలతో అందలం ఎక్కిన చంద్రబాబు ప్రశాంత పట్టణాన్ని డ్రగ్స్ నగరంగా మార్చేశారని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆరోపించారు. జివిఎంసి 30వ వార్డు పరిధి తాడివీధిలో పార్టీ వార్డు అధ్యక్షులు దశమంతలు మాణిక్యాలరావు అధ్యక్షతన జరిగిన బాబు ష్యూరీటి మోసం గ్యారంటీ కార్యక్రమానికి వాసుపల్లి గణేష్‌కుమార్ హాజరయ్యారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ప్రశాంతమైన విశాఖలో హత్యలు, అత్యాచారాలు, డ్రగ్స్, మద్యం బెల్టు షాపులు పెరిగిపోతున్నాయన్నారు. మీకు ఓటు వేసి మోసపోయిన ప్రజలకు ఏం చెబుతారని చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కల్యాణ్‌లకు సూటిగా ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేస్తున్నా అరాచక పాలన, మోసాలను ప్రజలకు వివరించారు. నాడు జగనన్న అందించిన సంక్షేమాన్ని కూటమి నేతలు ఎలా అటకెక్కించారో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దస్మాంతుల చిన్ని, ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండ రమణ పాల్గొన్నారు.

## ఎం శ్రేణిని ఆవిష్కరించిన శామ్‌సంగ్

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** శామ్‌సంగ్ తన సరికొత్త స్మార్ట్ మానిటర్ ఫ్యామిలీని ప్రకటించింది. ఇందులో ఎం 9, ఎం 8, ఎం7 మెరుగైన ఎడిషన్‌లు ఉన్నాయని, అధునాతన ఎఐ ఫీచర్లతో, కొత్త ఉత్పాదనలు పని, వినోదం కోసం కనెక్ట్ చేయబడి స్క్రీన్‌ను అందిస్తాయని శామ్ సంగ్ ఇండియా ఎంటర్ప్రైజ్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ పునీత్ సేథి తెలిపారు. విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు.

## విశాఖ వాసికి జాతీయ పురస్కారం

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారకరామారావు, భారతరత్న పివి.నరసింహారావు జయంతి ఉత్సవాల్లో విశాఖ వాసి, ప్రముఖ సంఘసేవకులు కొండపి ఎస్‌వి.గణేష్‌బాబుకు సాహితీ, సామాజిక సేవా రంగంలో పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారకరామారావు, భారతరత్న పివి.నరసింహారావు జయంతి పురస్కారం ప్రదానం చేశారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలి

### యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి




మహాసభలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా కమిటీ రెండవ మహాసభ జగదాంబ సిఐటియు కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ మహాసభకు కె.ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినప్పటికీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇంకా చెల్లించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. తక్షణం కనీస వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచుతూ జిఒ జారీ చేయాలని, మట్టి ఖర్చులు, ప్రసూతి సెలవులు, ఇతర సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.1లక్షా 50 వేలు ఇస్తామన్న జిఒలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎఎన్ఎం ట్రైనింగ్ పొందిన ఆశాలకు వెయిటేజ్ ఇవ్వాలని, నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలని కోరారు. 2026 జనవరిలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆగస్టులో జరిగే అఖిలభారత ఆశా వర్కర్ల సమ్మెను విజయవంతం చేయాలని, వేతనాలు పెంచే వరకు పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభ 33 మందితో నూతన జిల్లా కమిటీని, 14 మంది ఆఫీస్ బేరర్లను ఎన్నుకుంది. యూనియన్ గౌరవాధ్యక్షులుగా పి.మణి, అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.పద్మ, వి.మేరీ, కోశాధికారిగా వై.సీతారత్నం, ఉపాధ్యక్షులుగా అన్నపూర్ణ, సన్యాసి పైడమ్మ, లీలావతి, సరస్వతి, కుమారి, సహాయ కార్యదర్శులుగా డయానా, విజయలక్ష్మి, పి.లక్ష్మి, వై.పద్మ ఎన్నికయ్యారు.

# ఎండాడలో క్రెడాయ్ వైద్యశిబిరం

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:** కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) విశాఖపట్నం చాప్టర్, ఎంకె.వన్ గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సంయుక్తంగా నగరంలోని నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని భీమునిపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం ఎండాడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ నిర్మాణ రంగానికి బలంగా నిలిచే కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిర్వహించిన కార్యక్రమం అభినందనీయమన్నారు. వైద్యశిబిరంలో విశాఖపట్నంలోని వివిధ నిర్మాణ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న 550 మందికి పైగా కార్మికులు పాల్గొన్నారు. వారికి ఉచిత వైద్యపరీక్షలు, రోగ నిర్ధారణ సేవలు, ఆరోగ్య సలహాలు అందించడంతో పాటు బిపి, సుగర్, ఇఎన్‌టి, కంటి, దంత పరీక్షలు నిర్వహించినట్టు గీతం వైద్య నిపుణులు తెలిపారు. జీవనశైలి వ్యాధులు, వృత్తిపరమైన ఆరోగ్య సమస్యలపై నిపుణులు మార్గదర్శనం చేశారు. శిబిరానికి హాజరైన 550 మంది కార్మికులకు మందులు, పంపిణీ చేశారు. క్రెడాయ్ కార్యనిర్వాహక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐపి అబాకస్ ప్రారంభం

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:** ఎస్ఐపి అబాకస్ సంస్థ విశాఖలో తన తొలి బ్రాంచ్‌ను ఎంవిపి కాలనీ ఉషోదయ ప్రాంతంలో శనివారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ విక్టర్ మాట్లాడుతూ 2003లో ప్రారంభించిన తమ సంస్థ దేశవ్యాప్తంగా 385 నగరాలతో పాటు 11 దేశాల్లో విస్తరించిందని, 22 సంవత్సరాలుగా ఎస్ఐపి అబాకస్ పది లక్షలకు పైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిందని తెలిపారు. అనంతరం సంస్థ స్టేట్ హెడ్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 22 కేంద్రాలు ఉన్నాయని, 3500 మంది శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఈ శిక్షణకు ఆరు నుంచి 12 సంవత్సరాల పిల్లలు జీవిత నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. అబాకస్ శిక్షణ ద్వారా పిల్లల్లో ఏకాగ్రత, దృశ్యజ్ఞాపకశక్తి, అంకగణిత నైపుణ్యాలు, శ్రావణ నైపుణ్యాలు, క్లిష్టమైన నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

## అల్లూరి జిల్లాలో ఇగ్నో అధ్యయన కేంద్రం

### పాడేరు డిగ్రీకళాశాలలో ఏర్పాటుకు సన్నాహాలు

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:** ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యాన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అధ్యయన కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించింది. ఇగ్నో కేంద్రం స్థాపన ఆ జిల్లాలోని ఎందరో నిరుద్యోగుల, విద్యార్థుల అవసరాలు తీర్చడానికి ఉపయోగపడుతుందని ఇగ్నో ప్రాంతీయ కేంద్ర సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు అన్నారు. శనివారం స్థానిక ఇగ్నో ప్రాంతీయ కేంద్రం ఆవరణలో పాడేరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.చిట్టబ్బాయితో జరిగిన సమావేశంలో అధ్యయన కేంద్రం ఏర్పాటుకు సంబంధించి చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇగ్నో అధ్యయన కేంద్రం ద్వారా డిప్లమా, డిగ్రీ, పీజీ కోర్సులను అల్లూరి జిల్లా చుట్టూ పక్కల ప్రాంతాలలోని విద్యార్థులకు, ఉద్యోగార్థులకు చేరువ చేయగలమని, దీనిద్వారా ఆ ప్రాంత యువకులకు ఉద్యోగావకాశాలు పెరగుతాయన్నారు. పాడేరు డిగ్రీ కళాశాలలో అధ్యయన కేంద్ర ఏర్పాటుకు ముందుకు వచ్చిన ప్రిన్సిపల్ డాక్టర్ వి. చిట్టబ్బాయికి ధన్యవాదాలు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి. చిట్టబ్బాయి తమ కళాశాలలో ఇగ్నో అధ్యయన కేంద్రం కేంద్రం స్థాపించడానికి అంగీకరించిన ఇగ్నో సంచాలకులకు ధన్యవాదాలు తెలిపారు. త్వరగా ఏర్పాటు చేసి, ఆ ప్రాంత విద్యార్థులకు అవసరమైన అన్ని కోర్సులు అందుబాటులోకి తెచ్చి, ఉన్నత విద్యాప్రమాణాలతో కేంద్రాన్ని నడపటానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఇగ్నో ఉప సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు ఇగ్నో కోర్సులు, కార్యక్రమాల వివరాల్ని ప్రిన్సిపాల్‌కి వివరించారు.

## అనధికార ఫెనాల్టీ తొలగించాలి



గంగారావుకు వినతిపత్రం ఇస్తున్న సమైక్య ప్లాట్ ఓనర్స్

**ప్రజాశక్తి -గాజువాక:** తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ వాసులపై జివిఎంసి అనధికారికంగా విధిస్తున్న ఫెనాల్టీ తొలగించాలని అపార్ట్‌మెంట్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జె.రామన్న, కె.శ్రీనివాస్‌చౌదరి, ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావుకు వినతిపత్రం అందజేశారు. జివిఎంసి గాజువాక జోన్ 71వ వార్డు ఆటోనగర్. డి-బ్లాక్, చిన్నగంట్యాడ ఏరియా తోకాడలో 2015లో స్టెమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జివిఎంసి అనుమతితోనే 95ప్లాట్లతో సమైక్య అపార్ట్‌మెంట్ నిర్మించారన్నారు. దీనికి అక్యుపెన్సీ సర్టిఫికేట్ కూడా ఉందన్నారు. అయితే 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి అపార్ట్‌మెంట్‌వాసుల నుంచి ఆస్తి పన్నులతోపాటు అనధికారికంగా ఫెనాల్టీ వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై ఈ ఏడాది ఏప్రిల్ 21న జివిఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. సమైక్య అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల యజమానులకు అదనపున పన్ను ఫెనాల్టీ నుంచి విముక్తి కల్పించడంతోపాటు, ఇప్పటివరకు చెల్లించిన మొత్తాన్ని వాపసు చేయాలని కోరారు వినతిపత్రం ఇచ్చిన వారిలో బి తౌడన్న, కె.చిన్నం నాయుడు, ఎంవి రమణ అన్నారు.

## అశోక్ గజపతిరాజుకు సత్కారం

**ప్రజాశక్తి- వేపగుంట :** సింహచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజును ఆలయ ఇఒ వేంద్ర త్రినాధరావు, వు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, వేద పండితులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సింహగిరి ప్రదక్షిణ దిగ్విజయంగా ముగియడంపై కృతజ్ఞతలు తెలిపారు. పూలమాల, స్వామి శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాన్ని చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఇఒ త్రినాధరావును అశోక్‌గజపతిరాజు అభినందించారు. ఆలయ డిఇఇ రామరాజు ఉన్నారు.

## నేత్రపర్వంగా అప్పన్న ఆర్జిత సేవలు

**ప్రజాశక్తి- వేపగుంట :** సింహాద్రి అప్పన్న ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేసి, సహస్రనామార్చన చేశారు. భక్తులకు గోత్రనామాలతో పూజలు చేసి, ప్రసాదాలను అందజేశారు. అంతరాలయ దర్శనానికి అనుమతించారు.

## పాఠశాలలో మాక్ పార్లమెంట్



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో స్కూల్ కరెస్పాండెంట్

**ప్రజాశక్తి -తగరపువలస :** స్థానిక సాయి రవీంద్రస్కూల్‌లో శనివారం స్కూల్ యాజమాన్యం మాక్ పార్లమెంట్ నిర్వహించింది. ఓటింగ్ పద్ధతిలో ఎస్‌పిఎల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ బి.కృష్ణ మాట్లాడుతూ, ఈ తరహా కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? ఓటింగ్ విధానంపై విద్యార్థుల్లో అవగాహన ఏర్పడుతుందన్నారు. ప్రిన్సిపల్ వాంద్రాసి సతీష్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపుదలకు ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. అనంతరం ఎస్‌పిఎల్‌గా ఎన్నికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

# నీటి శుద్ధి ప్లాంట్ సమస్యలపై పరిశీలన



పరిశీలిస్తున్న ఎస్‌ఇ రవి, కార్పొరేటర్ జగన్ తదితరులు

**ప్రజాశక్తి -ఉక్కునగరం :** జివిఎంసి 87 వ వార్డు సిద్ధార్థనగర్‌లోని 12ఎంఎల్‌డి నీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను తాగునీటి సరఫరా విభాగం ఎస్‌ఇ కెవిఎస్.రవి శనివారం సందర్శించారు. 86,87 వార్డులకు మంచినీటి సరఫరాను చేస్తున్న ఈ ప్లాంట్ ద్వారా ఆయా వార్డుల పరిధిలోని నివాసితులకు సరిపడా నీరు అందడం లేదని, దీని సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని జివిఎంసి కౌన్సిల్‌లో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమస్యను ప్రస్తావించి, అధికారుల దృష్టికి తేవడంతో ఇక్కడ పరిస్థితుల పరిశీలనకు ఎస్‌ఇ వచ్చారు. స్థానిక కార్పొరేటర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాధం (జగన్)తో ప్లాంట్‌ను సందర్శించి పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్లాంట్‌లో క్లారిఫెయిర్ బ్రిడ్జి, ఆలం మిక్స్ చేసే ఫ్యాను, మోటర్లు పనిచేయట్లేదని, ప్రస్తుతమున్న ఆరు మోటర్లలో నాలుగే పనిచేస్తున్నాయని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ సరిపోదని, ఏటా రూ.19.,80లక్షలు వెచ్చిస్తున్నా ఎలక్ట్రికల్ మెయింటనెన్స్ సరిగా జరగడం లేదని, ఇలా పలు సమస్యలను ఎస్‌ఇ దృష్టికి జగన్‌తోపాటు స్థానికులు వివరించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు సాగి విజయరామరాజు, జివిఎంసి నీటి సరఫరా విభాగం ఇఇ పి.శ్రీనివాస ప్రసాద్, డిఇఇ బి.డి శ్రీనివాస్, ఎఇఇ పి కేదార్నాథ్, వాటర్ డిపార్ట్మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

# సమరశీల పోరాటాలకు సిద్ధం కండి

- కారంచేడు దళిత అమరవీరుల వర్ధంతిలో వక్తలు




వర్ధంతి సభలో పాల్గొన్న వక్తలు

**ప్రజాశక్తి- సీతమ్మధార :** మనువాద కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రజా దళిత పౌర సంఘాలు సమరశీల పోరాటాలు చేయాలని కారంచేడు ఉద్యమ సామాజిక కార్యకర్త భగత్ సింగ్ పిలుపునిచ్చారు. కారంచేడు దళిత అమరవీరుల 40వ వర్ధంతి సభ సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ, 1985 జూలై 17న కారంచేడులో దళితుల నెత్తురు ఏరులై పారిందని ఒక పథకం ప్రకారం చుట్టుపక్కల గ్రామాల భూస్వాములు దాడికి తెగబడి ఐదుగురిని మట్టుబెట్టారన్నారు మరెవ్వరూ తమకు ఎదురు తిరగకూడదనే లక్ష్యంతో కుట్రపూరితంగా, ఉద్దేశ్యపూర్వకంగా దుడ్డు రమేష్, తేళ్ల మోషే, తేళ్ల ముత్తయ్య, తేళ్ల యెహొూషువ, దుడ్డు వందనం, దుడ్డు అబ్రహం చంపబడ్డారని, దాదాపు 100 మందిని గాయపరిచి మహిళలపై అత్యాచారాలు చేశారని నాటి సంగతులను గుర్తు చేశారు. ఘటనకు ప్రధాన సాక్షిగా ఉన్న దుడ్డు వందనం తల్లి ఆలీసమ్మను సాక్ష్యాలను లేకుండా చేయడానికి నిద్రిస్తుండగానే ఇంట్లోనే హత్య చేశారని వివరించారు. నాటి ఉద్యమానికి దళిత సంఘాలు, విప్లవ సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు బాధిత దళితులకు అండగా నిలిచాయని తెలిపారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు వై కొండయ్య మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులు తమ ఏజెండాను అమలుకు ప్రజల మధ్య విద్వేషాలు, ప్రజా పోరాటాలను దెబ్బతీయ గలిగే శక్తులను అన్వేషించాయని తెలిపారు. దళిత బహుజన శక్తుల హక్కులను నీరు గార్చే కుట్రలకు పూనుకున్నారని, వీటికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

సావిత్రిబాయి పూలే ట్రస్ట్ చైర్ పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ చాతుర్వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థలకు వ్యతిరేకంగా పలువురు మహనీయులు త్యాగపూరిత పోరాటాలు నిర్వహించారని, న్యూ డెమోక్రసీ కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో దళితులపై దాడులుపెరిగాయని, కారంచేడు, చుండూరు తదితర సామాజిక న్యాయ పోరాటాల స్ఫూర్తితో ప్రతిఘటించాలన్నారు.. న్యూ డెమోక్రసీ ఏరియా కమిటీ నాయకులు కె. నిర్మల అధ్యక్షత జరిగిన సభలో భీం సేన వార్ అధ్యక్షులు కె చిన్నారావు, పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు ఎం లక్ష్మి, దళిత విముక్తి కన్వీనర్ ఎస్‌వి రమణ, భారత నాస్తిక సమాజం జీడి సారయ్య, ప్రజాపోరు దేవా మాట్లాడారు. అరుణోదయ కళాకారులు కారంచేడు అమరుల గురించి పాడిన పాటలు, దళిత చైతన్య పాటలుఉత్తేజపరిచాయి.

## ఎన్‌ఎంఎంఎస్ శిక్షణా తరగతులు

**ప్రజాశక్తి -తగరపువలస :** నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పొందేందుకు విద్యార్థులకు శనివారం చిట్టి వలస జెడ్పీ హైస్కూల్‌లో శిక్షణా తరగతులు నిర్వహించారు. చిట్టివలస, లక్ష్మీపురం, మంగమారి పేట జెడ్‌పి హైస్కూళ్లకు చెందిన 120 మంది విద్యార్థులు హాజరయ్యారు ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షులు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## వ్యవసాయ బోర్లు వద్ద నారు పోతలు

**ప్రజాశక్తి- పద్మనాభం:** మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్‌లో ప్రధాన వరి పంట సాగులో భాగంగా ఇప్పటికే సిద్ధం చేసిన నారుమళ్లలో రైతులు వరి విత్తనాలు చల్లే పనులు ముమ్మరంగా చేస్తున్నారు. మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం, మద్ది, అనంతవరం, కృష్ణాపురం, పద్మనాభం గ్రామాల్లో వ్యవసాయ బోర్లు ఆధారంతో వరినారు పోతలు చురుగ్గా సాగుతున్నాయి. రోజూ జల్లులు కురుస్తున్నా, సరిపడా వర్షం లేక అన్నదాతలు ఆశగా ఆకాశానికేసి చూస్తున్నారు.

## ఆసుపత్రి నుంచి ఐదుగురు 'పి 4' మార్గదర్శకులు : డిఎంహెచ్‌ఒ

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :** ప్రభుత్వం చేపట్టిన పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్ షిప్ (పి 4)కు సంబంధించి ప్రతి ఆసుపత్రి నుండి కనీసం ఐదుగురు మార్గదర్శిలు ఉండేలా చూడాలని విశాఖ వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. బిల్ జంక్షన్ సమావేశ మందిరంలో విశాఖపట్నం జిల్లాలోని అన్ని ప్రైవేటు హాస్పిటల్స్ యాజమాన్యం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఆంధ్ర మెడికల్ కళాశాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (అంకోసా), ఎపిఎన్‌ఎ, ఐఆర్‌ఎ, నవరతన్ చారిటబుల్ ట్రస్ట్ (వరుణ్ గ్రూప్), శంకర్ ఫౌండేషన్ మొదలగు ప్రతినిధులతో శనివారం పి4 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ, బంగారు కుటుంబం-మార్గదర్శి అంటే ఏమిటి వాటి గురించి వివరించారు. ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ, పి4కు అసోసియేషన్ తరపున పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు.

## నేరాలు ఘోరాలు

### శాంతి ఆశ్రమం కేసులో ముగ్గురు అరెస్ట్

**ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ :** శాంతి ఆశ్రమం కేసులో ముగ్గురు మహిళలను పోలీసులు అరెస్టుచేశారు. నగరం నడిబొడ్డున ఎకరాల కొలదీ భూములున్న శాంతి ఆశ్రమానికి సంబంధించి ఇరు వర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ కేసుకు సంబంధించి కోర్టుల్లో లావాదేవీలు నడవగా స్థలాలన్నీ ఆశ్రమానికే చెందుతాయని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అక్రమార్కులు స్థలాన్ని ఖాళీ చేయకపోవడంతో ఆశ్రమం ప్రతినిధులు పోలీసులను ఆశ్రయించారు. ఆ తర్వాత వైసీపీకి చెందిన జివి.రామచంద్రరావు మరోకరి వద్ద డబ్బులు తీసుకుని రౌడీషీటర్లను రంగంలోకి దింపి హింసను సృష్టించారనే ఆరోపణలతో ఎంవిపి పోలీసులు 25మందికి పైగానే హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో తాజాగా ప్రధాన నిందితునిగా సిద్ధు ఉన్నారు. ఆయన భార్య, సోదరి, సోదరి స్నేహితురాలిని ఎంవిపి పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

### చైన్ స్నాచింగ్ కేసులో నిందితుల అరెస్ట్

**ప్రజాశక్తి -మధురవాడ :** చైన్‌స్నాచింగ్ కేసులో ఢిల్లీకి చెందిన ఇద్దరు నిందితులను పిఎం.పాలెం నేరవిభాగం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. క్రైం ఎసిపి లక్ష్మణరావు తెలిపిన వివరాలివి.

ఆరిలోవ ప్రాంతానికి చెందిన మీసాల ఉష గతనెల 13న భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి బైక్‌పై వెళుతుండగా, రుషికొండ గీతం కళాశాల సమీపంలో స్పీడు బ్రేకర్ వద్ద వీరు బైక్ స్లోకాగానే, ఢిల్లీకి చెందిన దీపిక్‌కుమార్, కుమోద్ కుమార్ బైక్ వెనుకన కూర్చున్న ఉష మెడలోని 32 గ్రాముల బంగారు గొలుసు తెంచుకుపోయారు. బాధితులు పిఎం.పాలెం పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసిన సిఐ బిఎస్‌ఎన్.ప్రకాశ్ సూచనలతో ఎస్‌ఐ రంభ శ్రీనివాసరావు దర్యాప్తు చేశారు. బీచ్‌లో గస్తీ తిరుగుతున్న పోలీసులను చూసి నిందితులు పారిపోయే ప్రయత్నం చేయగా, పట్టుకుని విచారించడంతో నేరాన్ని అంగీకరించారని ఎసిపి తెలిపారు. నిందితుల నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు.

### వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



పెద్దిపాటి లోకేష్

**ప్రజాశక్తి -గోపాలపట్నం :** జివిఎంసి 89వ వార్డు కొత్తపాలెం దరి డిఆర్ నగర్ శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న పెద్దిపాటి లోకేష్ (33) వారం రోజులుగా కనిపించడం లేదని అతని తండ్రి పెద్దిపాటి మల్లేశ్వరరావు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివి.

పెద్దిపాటి మల్లేశ్వరరావు ఇద్దరు కుమారుల్లో చిన్నవాడైన పెద్దిపాటి లోకేష్ శంకర ఫౌండేషన్ ఐ హాస్పిటల్‌లో జూనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గత శనివారం డ్యూటీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆదివారం మధ్యాహ్నం తనకు బతకాలని లేదని, చనిపోతానని అతని వాట్సాప్ స్టేటస్‌లో మెసేజ్ పెట్టాడు. దీనిపై ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు అతని స్నేహితులు వద్ద విచారించగా, లోకేష్ కొందరి వద్ద అప్పులు చేశాడని, అందుకే ఆత్మహత్య చేసుకుంటానని ఫ్రెండ్స్‌కు చెప్పినట్లు తెలిసింది తర్వాత లోకేష్ ఫోను స్విచ్ఛాఫ్ అయ్యింది. తన బిడ్డ ఆచూకీ కనిపెట్టాలని లోకేష్ తండ్రి పెద్దిపేట మల్లేశ్వరరావు కోరాడు.

## దళితుల భూసమస్యలను పరిష్కరించాలని వినతి

**ప్రజాశక్తి -ఆనందపురం :** స్థానిక తహశీల్దార్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన సూరిశెట్టి శీనుబాబును శనివారం మాల మహానాడు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు మాట్లాడుతూ, మండలంలో దళిత భూసమస్యలపై దృష్టి పెట్టి న్యాయమైన పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర మాల మహానాడు కన్వీనర్ శివ, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి సింహాద్రి రాంబాబు, భీమిలి కన్వీనర్ సన్నిబాబు, బోని శివ, యాగాటి రామారావు, పలకల అప్పారావు, గుడివాడ చెంగలమ్మ, సింహాద్రి వాసు పాల్గొన్నారు.

# నైపుణ్య శిక్షణకు ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- సీతమ్మధార : నైపుణ్య శిక్షణపై సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సిఐటిడి)తో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా సిఐటిడి ప్రిన్సిపల్ డైరెక్టర్ విజయ్‌కృష్ణకాంత్ మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా కళాశాల విద్యార్థులకు పలు శిక్షణ కార్యక్రమాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇండస్ట్రీ 4.0 అవసరాలకు అనుగుణంగా అన్ని విభాగాల ఇంజనీరింగ్ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణనిస్తున్నట్లు తెలిపారు.కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్. జి. మధుకుమార్ మాట్లాడుతూ అధ్యాపకులు నూతన పరిజ్ఞానంతో సమకాలీన అంశాలపై అవగాహన అవసరమన్నారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. దీపక్‌చౌదరి, ఎంఎస్ఎంఇ కన్సల్టెంట్ కె.ఎస్.ఎస్. ప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# వార్డు సమస్యలపై ఎంపీకి వినతి



విశాఖ ఎంపీ శ్రీభరత్‌తో మాట్లాడుతున్న అశోక్ చక్ర వర్తి

ప్రజాశక్తి-తగరపువలస : విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్‌ను నగరంలోని ఆయన కార్యాలయంలో జివిఎంసి రెండో వార్డు టిడిపి నాయకులు చెట్టి అశోక్ చక్ర వర్తి కలిశారు. వార్డులో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం హయాంలో ఈ ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అశోక్ చక్ర వర్తి వివరించారు. వార్డు పరిధిలో పార్టీ అభివృద్ధికి, విస్తృతికి కార్యకర్తలతో సమన్వయం చేసుకుని తన వంతు కృషి చేస్తున్నానన్నారు. అనంతరం అశోక్‌చక్రవర్తిని ఎంపీ అభినందించారు.

# గ్రీన్ ట్రెండ్స్ సెలూన్ ప్రారంభం



గ్రీన్ ట్రెండ్స్ సెలూన్ ప్రారంభిస్తున్న సినీనటి సురభి

ప్రజాశక్తి- గాజువాక: హెయిర్ కట్ నుంచి బ్రైడల్ లుక్ వరకు కస్టమర్ల విశ్వాసాన్ని చూరగొన్న 'గ్రీన్ ట్రెండ్స్ సెలూన్' ను గాజువాక చినగంట్యాడలో హనూస్ ఫిలిం ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో సినీ నటి సురభి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురుషులు, మహిళల ఆదరణ పొందుతున్న సెలూన్ ఇదని, ఇక్కడ శిక్షణ పొందిన వారే పనిచేస్తారన్నారు. అనతికాలంలోనే ప్రజాదరణ పొందుతుందని అభిలషించారు. ఈ సందర్భంగా ఫ్రాంఛైజీ ప్రతినిధులు బూరాడపతి దివ్య, బాసిరెడ్డి దివ్యారెడ్డి, అల్లు నీలవేణి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గ్రీన్ ట్రెండ్స్ బ్రాండ్‌కు ఎంతో మంచి పేరుందన్నారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సేవలు అందిస్తామన్నారు. కూర్మన్నపాలెంలో మరో సెలూన్ కూడా ప్రారంభించామన్నారు. సినీనటి సురభి వస్తుందని ప్రచారంతో పెద్దఎత్తున సినీ అభిమానులు అక్కడికి చేరుకున్నారు. వారితో సెల్ఫీలు దిగుతూ సురభి సందడి చేశారు.

## కార్మిక పోరాటంతోనే

# ఉక్కు ప్రయివేటీకరణకు అడ్డుకట్ట

- స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగుల సన్మానసభలో సిపిఎం నేత డాక్టర్ గంగారావు



రిటైర్డు ఉద్యోగులను సత్కరిస్తున్న గంగారావు, వెంకటేష్ తదితరులు

ప్రజాశక్తి-గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ముక్కలు చేసి ప్రైవేట్‌కు కట్టబెట్టడానికి నాడు వైసిపి, నేడు కూటమి పార్టీలు చూస్తున్నాయని, అయితే అకుంఠితదీక్షతో కార్మికులు చేసిన పోరాటాలతోనే ఇప్పటివరకు ప్రయివేటీకరణకు అడ్డుకట్ట పడిందని 78వ వార్డు కార్పొరేటర్, జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి గంగారావు అన్నారు. శుక్రవారం తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో గత నెలలో ఉద్యోగ విరమణ చేసిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు వైటి.దాస్, టి.చిన్నబాబు, కె.ముత్యాల నాయుడు, కె.సుబ్బారావులను అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.
ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 35ఏళ్లకుపైగా పనిచేసి, ప్లాంట్ పరిరక్షణకు, కార్మికుల ప్రయోజనాలకు జరిగిన పోరాటాల్లో ఇలాంటివారే పాల్గొన్నారని కొనియాడారు. ప్రభుత్వరంగం నుంచి ప్రయివేటుకు దారాదత్తమైన ముగ్గురు ఇటువంటి అభినందన సభలు సాధ్యం కాదన్నారు. ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, రాత్రికిరాత్రే నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, ఒత్తిడి తెచ్చి రెగ్యులర్ కార్మికులకు విఆర్ఎస్ ఇస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి వారి స్ఫూర్తితో నేటితరం స్టీల్‌పరిరక్షణకు పోరాడాలని పిలుపునిచ్చారు సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ, ప్రజలు, కార్మికుల శ్రేయస్సు కోసం సిపిఎం, సిఐటియు పనిచేస్తున్నాయని, అలాంటి యూనియన్‌లో పనిచేసిన వీరు నలుగురు అభినందనీయులన్నారు. ప్రజలకు ఎక్కడ కష్టం వచ్చినా అక్కడ వీరు ఉంటారని గుర్తు చేశారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌కు ఒక ప్రత్యేకత ఉ ందని, ఉద్యోగ విరమణ చేసిన వారిని సత్కరించడం ఇక్కడ ఫ్లాట్ ఓనర్స్‌కు ఆనవాయితీగా మారిందన్నారు.ఉద్యోగ విరమణ చేసిన నలుగురూ ఒకే ఆశయం కోసం పనిచేశారన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు జె రామన్న అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో వైవి.చౌదరి, మహిళా కమిటీ అధ్యక్షులు రమణి, సెక్రటరీ శాంతి పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ ఫ్రీ రాష్ట్రం లక్ష్యం

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జివిఎంసికి అవార్డు హర్షణీయం
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



కాపులుప్పాడ డంపింగ్ యార్డు పరిశీలనలో పట్టాభిరాం

ప్రజాశక్తి- కొమ్మాది : డంప్‌యార్డ్ ఫ్రీ రాష్ట్రంగా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమనిస్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో జివిఎంసికి స్థానం దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఐదో వార్డు కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. డంపింగ్ యార్డ్ వద్ద పరిస్థితులు పర్యవేక్షించి, ఘనవ్యర్థాల నిర్వహణ, వేస్ట్ ఎనర్జీపై జివిఎంసి అధికారులతో చర్చించి తగు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించాలని సిఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. స్వచ్ఛతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, దాని ఫలితంగానే జివిఎంసికి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డుతోపాటు రాష్ట్రంలో గుంటూరు, తిరుపతి, రాజమండ్రి నగరపాలక సంస్థలకు సూపర్ స్వచ్ఛలీగ్‌లో చోటు దక్కిందన్నారు. జివిఎంసి పరిధిలోని వ్యర్థాలను రెండు నెలల్లో క్లియర్ చేసేందుకు 95 ఎలక్ట్రిక్ వాహనాలను అందిస్తామన్నారు. రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేయాలన్న సిఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా విశాఖలో చెత్త నిర్వహణ బాధ్యతను జిందాల్ సంస్థకు అప్పగించామన్నారు. డ్రోన్‌లు పెట్టి మొత్తం చెత్తను క్లియర్ చేస్తామన్నారు.జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, ఏడాదిలో జివిఎంసికి రెండు అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు.కార్యక్రమంలో ఎడిసి రమణ, సిఎంఒహెచ్ నరేష్, జెడిసి కనకమహాలక్ష్మి, ఎంఒహెచ్ఒ కిషోర్, జిందాల్, జిగ్మా ప్రతినిధులు పాల్గొన్నారు

# ప్రజల్లోకి కూటమి మోసాలే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కెకె.రాజు

ప్రజాశక్తి -సీతమ్మధార: ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, అవినీతి, అక్రమాల మయమైన కూటమి ప్రభుత్వ విధానాలు, సిఎం చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం లక్ష్యమని వైసిపి జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు అన్నారు. శనివారం అక్కయ్యపాలెం,షాదిఖానా కళ్యాణ మండపంలో పార్టీ పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబూరావు పర్యవేక్షణలో నిర్వహించిన సమావేశంలో రాజు మాట్లాడుతూ. తెలుగుదేశం, జనసేన,బిజెపి పార్టీలు కూటమిగా ఏర్పడి సూపర్ సిక్స్ పేరుతో అమలు చేయని హామీలిచ్చి ప్రజలందరినీ మభ్యపెట్టి, మోసగించి, అధికారంలోకి వచ్చాయని, వచ్చిన తర్వాత అనేక హామీలను అటకెక్కించాయన్నారు. చంద్రబాబు ఏకపక్ష నిర్ణయాలతోప్రతి అంశంలో వివక్ష చూపిస్తూ, కూటమి ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే గొంతుకును నొక్కే అరాచకచర్యలు తప్పుడు కేసులతో నియంతృత్వ పాలన సాగిస్తున్నాయన్నారు.
పార్టీ పరిశీలకులు కదిరి బాబూరావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం బాగుపడాలంటే మరలా జగన్ సీఎం కావాల్సిన అవసరం ఉందని, దీనికిపార్టీ శ్రేణులంతా కష్టబడి పనిచేయాలన్నారు. స్వల్పతేడాతో రెండు సార్లు విజయానికి దూరమైనప్పటికీ, పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేస్తున్న కెకె.రాజును అభినందిస్తూ, ఇలాంటి వ్యక్తి ఎమ్మెల్యే అయితే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ కుమార్,రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, వుడా మాజీ చైర్మన్ రవిరాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కె.వి.యన్ శశికళ, సేనాపతి అప్పారావు, బొడ్డేటి. కిరణ్ పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ పాలకవర్గానికి ప్రతిపాదన

ప్రజాశక్తి-పద్మనాభం: . భీమిలి మార్కెట్ కమిటీ పాలకవర్గంలో పద్మనాభం మండలానికి చెందిన ఆరుగురికి స్థానం కల్పించేందుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నిర్ణయం మేరకు కొత్తగా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు మండల టిడిపి అధ్యక్షుడు కె.రమణ తెలిపారు. ఇప్పటికే పద్మనాభం మండలం అయినాడకు చెందిన జనసేన నేత కురిమిన రామస్వామినాయుడుకు భీమిలి ఎఎంసి చైర్మన్‌గా ఇప్పటికే ప్రకటించగా, ఇపుడు బుడ్డివలస పంచాయతీ లింగన్నపేటకు చెందిన పిన్నింటి జగన్నాథంను వైస్‌చైర్మన్‌గా,విలాస్‌ఖాన్‌పాలెంకి చెందిన కాళ్ల శ్రీను, కొవ్వాడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కరిమిరెడ్డి వెంకటలక్ష్మి, పెంట గ్రామానికి చెందిన. అనుమాల శెట్టి సత్య కామేశ్వరరావు, తునివలస గ్రామానికి చెందిన వాళ్ల నందినిలను డైరెక్టర్లుగా నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో భాగంగా ఇప్పటికే అయినాడకు చెందిన టిడిపి నేత కురిమిన లీలావతిని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. నామినేటెడ్ పందేరంలో పద్మనాభం మండలానికి అధిక ప్రాధాన్యతనివ్వడంపై స్థానిక కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# సింహాద్రి అప్పన్న సన్నిధిలో 'కూన'

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్నను శనివారం రాష్ట్ర పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే కూన రవికుమార్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ డిప్యూటీ ఇఒ సింగం రాధ, డిప్యూటీ ఇంజనీర్ హరి, ఆలయ పర్యవేక్షణ అధికారి త్రిమూర్తులు స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదం, చిత్రపటం బహూకరించారు.

## ఐక్యతా సేవా సంఘం చొరవతో

# విద్యుత్ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 94వ వార్డు కృష్ణానగర్ వేదిక ఫంక్షన్ హాల్ ఎదురుగా బిఆర్‌టిఎస్ మెయిన్ రోడ్‌పై వేలాడుతున్న విద్యుత్ వైర్ల సమస్యకు స్థానిక ఐక్యత సేవా సంఘం చొరవతో పరిష్కారం లభించింది. వేలాడుతున్న విద్యుత్ వైర్లు గాలికి రాసుకుంటూ నిప్పులు పడుతుండడంతో విద్యుత్‌కు అంతరాయంతోపాటు ప్రమాదభరితంగా మారాయి. స్థానిక ఐక్యత సేవా సంఘం గౌరవాధ్యక్షులు, జనసేననేత ఎర్ర నాగరాజు సమస్యను పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తేవడంతో వారు స్పందించి, విద్యుత్ వైర్లు కలిసిపోకుండా బ్రాకెట్లు ఏర్పాటు చేశారు. ముమ్ముందు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారని నాగరాజు తెలిపారు.

# ఆరోగ్య కేంద్రం రైలింగ్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఏడోవార్డు గణేష్ నగర్, అల్లూరి సీతారామరాజు నగర్ లోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని స్టీల్ రెయిలింగ్‌ను పౌర సంక్షేమ సంఘం సభ్యులు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యాధికారి సమస్యను పౌర సంక్షేమ సంఘం దృష్టికి తేగా, పౌర సంక్షేమ సంఘ అధ్యక్షులు ఎల్ఎస్ నాయుడు, నాగోతి సూర్య ప్రకాష్ అధ్వర్యంలో మరమ్మతులు చేశారు. కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం సభ్యులు జగన్మోహన్ చౌదరి, బెల్లపు పాపారావు, ఎస్‌వి.రమణ, బయపల్లి సతీష్ కుమార్, పోలిశెట్టి నాగేశ్వరరావు, వైద్యాధికారి డాక్టర్‌మానస లక్ష్మి పాల్గొన్నారు.

# హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌పై ఆందోళన ఉధృతం

**- అదానీ చిత్రపటాలు దహనం**
**- విల్లంబులు ఎక్కుపెట్టిన గిరిజనులు**

ప్రజాశక్తి- అనంతగిరి, దేవరాపల్లి
అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ రేగులపాలెం, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతలపూడి ఏరియాలో హైడ్రో పవర్ ప్లాంట్స్ అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదాని చిత్రపటాన్ని రేగులపాలెం వద్ద దగ్ధం చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మిస్తే చూస్తూ ఊరుకునేది లేదని తరిమి కొడతామని గిరిజనులు స్పష్టం చేసారు. రేగులపాలెం వద్ద అదాని హైడ్రోపవర్ ప్లాంట్లుకు వ్యతిరేకంగా గత నాలుగు రోజుల నుండి గిరిజనులు చేస్తున్న ఆందోళన శనివారం కూడా కొనసాగింది. అదాని చిత్ర పటాలను దగ్ధం చేసి గిరిజనుల సాంప్రదాయం విల్లంభులతో పెద్ద ఎత్తున ఆందోళన చేసారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిపిఎం నేత డి వెంకన్న మాట్లాడుతూ, పెదకోట ఏరియాలో 1800 మేగవాట్లు ప్రాజెక్టును నిర్మించడం దారుణమన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలోని ఆదివాసీలను వెళ్ల గొట్టేందుకు తీవ్ర మైన ప్రయత్నం చేయడం చట్ట వ్యతి రేఖమన్నారు. హైడ్రోపవర్ ప్లాంట్ నిర్మాణంతో పేదకోట ఏరియాలో పెద్దకోట, రేగులపాలెం, కొండిబకోట తదితర గ్రామాలను ఖాళీ చేయించే పనిలో అదాని మనుషులు పూనుకున్నారని, దీన్ని గిరిజనులు ప్రతిఘటిస్తున్నారని తెలిపారు. జీవో 51 ను రద్దు చేయాలన్నారు. విజయనగరం జిల్లా వేపాడ మండలం మారిక దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీల మధ్యలో శారదా నదిపైన 900 మేగవాట్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చారని, జీవనదులు ఉన్న చోట ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీంతో రైవాడ ఆయకట్టు రైతులకు, విశాఖ ప్రజల తాగు నీటి అవసరాలకు తీవ్రమైన విఘాతం కలిగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసారు. 1/70 చట్టం, పెసా, అటవీ హక్కుల చట్టాన్ని ధిక్కరిస్తూ ఈ ప్రాజెక్టులకు అనుమతించిన తీరు తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందని తెలిపారు. పీసా చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం ఏదైనా భూసేకరణకు ముందు, ప్రభుత్వం ప్రాజెక్ట్ సమాచారాన్ని ప్రభావిత గ్రామ పంచాయతీ, గ్రామ సభలతో సంప్రదించి వారి అభిప్రాయాలను తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ సంప్రదింపుల ప్రక్రియను పూర్తిగా దాట వేశారని తెలిపారు. ఈ ప్రాజెక్టులపై ముందస్తు సంప్రదింపులు జరపడానికి ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. ఇప్పటికీ టి.ఎ.సిని నియమించలేదన్నారు. ప్రభుత్వ ఇచ్చిన జీవో నెంబరు 51 పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేసారు ఈ కార్యక్రమంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు కమిటీ సభ్యులు జె.ఈశ్వరరావు, అరుణ్, దేముడు, గోవింద్, ఆర్ కె.డి ఈశ్వరావు, చిన. ఎర్రయ్య, దేముడు. గిరిజనులు పాల్గొన్నారు


విల్లంబులు ఎక్కుపెట్టిన గిరిజనులు


మెప్మా రిసోర్స్ పర్సన్స్‌కు ట్యాబ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

## మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : మహిళలు ఆర్థిక స్వావలంబన చెందేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా మెప్మా రిసోర్స్ పర్సన్లకు ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ మహిళల ఆర్థికంగా స్థిరపడేందుకు రిసోర్స్ అందరూ కృషి చేయాలన్నారు. డ్వాక్రా రుణాలను ఉపయోగించి చిన్న చిన్న మిషనరీల ద్వారా వ్యాపారాలు చేసి ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సోలార్ సూర్య ఘర్ పథకంలో ముందు ఆర్పీలు చేరి తద్వారా డ్వాక్రా గ్రూప్ సభ్యులందరిని సోలార్ సూర్య ఘర్ స్కీములో చేరేలా ప్రోత్సహించాలని కోరారు. గ్రూపులోని ప్రతి మహిళకు ఇన్సూరెన్స్ పాలసీలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, ఏపీడీవో సంతోష్, టిడిపి, జనసేన 80వ వార్డు ఇన్‌ఛార్జులు బిఎస్ఎన్వే జోగినాయుడు, బుద్ధ శ్రీనివాసరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణ, దూలం గోపీనాథ్, మంగ ఈశ్వర్, చేట్రోలు దుర్గాప్రసాద్, పోలారపు త్రినాథ్, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 17న జరుగు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు మొల్లి సన్నిబాబు పిలుపునిచ్చారు. అనకాపల్లి విజయా రెసిడెన్సీలో శనివారం మహాసభ పోస్టర్‌ను జిల్లా బీసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహాసభ విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఈ నెల 17న జరుగుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులతో సహా దాదాపుగా 10వేల మంది ఈ సభకు హాజరవుతారన్నారు. ఈ మహాసభకు జిల్లా నుండి అత్యధిక శాతం బీసీలు హాజరుకావాలని కోరారు. బీసీలకు రిజర్వేషన్ శాతం పెంచాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కిల్లాడ అప్పల రాజు, బోయిన భానుమూర్తి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు కోన నాగేశ్వరరావు, నాయకులు రంధి గణపతి, బండారు అప్పారావు, ముప్పల నారప్ప, దాలిబోయిన గోవింద, ఊరిగిటి నాగమణి పాల్గొన్నారు.

## డిగ్రీ అడ్మిషన్లు వెంటనే చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి
విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభం కాకపోవడం పట్ల సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో గత ప్రభుత్వం ఉన్నత విద్యా రంగంలో అనేక మార్పులు చేసిందని, దీనివల్ల డిగ్రీ విద్యలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ విధానాలను ప్రతిపక్షంలో వున్నప్పుడు విమర్శించిన కూటమి పార్టీల నేతలు నేడు కొత్త విధానాన్ని రూపొందించకుండా డిగ్రీ ప్రవేశాలు ఆలస్యం చేయడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని తొలగించి డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం తెస్తున్నట్లు కూటమి నేతలు ప్రకటించిన కొద్ది రోజులకే తిరిగి సింగిల్ సబ్జెక్టు విధానాన్ని కొనసాగించాలని నిర్ణయించడం సరికాదని పేర్కొన్నారు. డిగ్రీ ప్రవేశాలు ఆన్లైన్ లేదా ఆఫ్లైన్లో నిర్వహించాలా అనే విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. ఉన్నత విద్య పట్ల ఇంత గందరగోళంగా వ్యవహరించడం సరికాదని హితవుపలికారు. ఇంటర్ పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం కాకపోవడంతో లక్షలాది విద్యార్థులు ఆందోళనలో వున్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమే ఆలస్యం అయితే చివరిలో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు మన పొరుగు రాష్ట్రాల్లో నెల రోజుల క్రితమే డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. మన రాష్ట్రంలో ఆలస్యం కావడంతో డిగ్రీలో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గే అవకాశం ఉందని, ప్రభుత్వం వెంటనే స్పష్టమైన విధానాలతో డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## ఎంఆర్‌పిఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేట గ్రామంలో శనివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కోరుబిల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో సంఘం 31వ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంఘం జిల్లా అధ్యక్షులు ఏలుసూరి ఘాటీలు ఎంఆర్‌పిఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన కమిటీలు త్వరలోనే ఏర్పాటు చేస్తున్నామన్నారు. వర్గీకరణ సాధించుకున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించుకోవాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేశారు. నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు కొత్తల ఈశ్వరరావు, మాదిగ ఉద్యోగ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు, బీడికాడ మండలం నాయకులు సిహెచ్.వెంకట్రావు, గంపల శివ, గంపల రమణ, తాడి సంతోష్, గంపల శివ పాల్గొన్నారు.

## ఆవ సోమవరంలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఆవ సోమవారం గ్రామంలో శనివారం ఉదయం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పర్యటించారు. గ్రామంలో డ్రైనేజీలు, చెరువులు, రహదారులను పరిశీలించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సాని కాలువ జంక్షన్ నుంచి మడుతూరు వరకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ జెడ్ పరిశ్రమలకు సానికాలువ మీదుగా మడుతూరుకు రహదారి నిర్మించడానికి ప్రతిపాదన చేస్తానని చెప్పారు. రహదారి వేయడం వలన పరిశ్రమలకు నేరుగా భారీ వాహనాలు రాకపోకలకు వీలుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సిరసపల్లి రమణ, జనపరెడ్డి నర్సింగరావు, కోలా మహేష్, పి. రాముసాయుడు, పాల్గొన్నారు.


బైక్‌పై వెళ్తూ మధ్యలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు


## ఎడ్లవీధి చెరువులో చేపలు మృత్యువాత


చనిపోయిన చేపలను తీస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరంలోని ఎడ్లవీధి చెరువులో చేపలు పెద్ద ఎత్తున మృత్యువాత చెందాయి. గ్రామంలోని డ్రైయినేజీల ద్వారా మురుగునీరు ఆ చెరువులోకే వెళ్తుండడంతో చేపలు మృతి చెందినట్లు తెలుస్తోంది. చేపలు మృతి చెంది రెండు రోజులు కావడంతో చుట్టుపక్కల నివాసాల ఉండే ప్రజలకు దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పంచాయతీ సిబ్బంది, స్థానిక మత్స్యకార సొసైటీ నాయకులు చొరవ తీసుకొని చనిపోయిన చేపలను ఏరి వేయించే పని చేపట్టారు. చేపలు మృతి చెందడంతో విపరీతమైన చెడు వాసన వస్తుందని, దీంతో ఇళ్లలో ఉండడం కష్టంగా మారిందని స్థానికులు వాపోయారు. చేపలను ఏరివేసిన తరువాత ఆ ప్రాంతమంతా బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో స్థానిక వార్డ్ సభ్యులు ఒరుగంటి నాగమణి నెహ్రూబాబు, పంచాయతీ మేస్త్రి రాజేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పిఎసిఎస్ త్రిసభ్య కమిటీకి బాబ్జీ అభినందనలు

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక శ్రీదుర్గాంబ పిఎసిఎస్‌కి నూతనంగా ఎంపికైన త్రిసభ్య కమిటీ సభ్యులను టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జి అభినందించారు. ఈ మేరకు కొత్తగా ఎంపికైన పిఎసిఎస్ చైర్మన్ గండి దేముడు, డైరెక్టర్లు పల్లా తాతారావు, బొబ్బురి కన్నారావు, సీనియర్ నేతలు మొగలిపురంలోని గండి బాబ్జి నివాసానికి వెళ్లి శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని గండి బాబ్జి పూలమాలలు వేసి సాలువలతో సత్కరించారు. త్రిసభ్య కమిటీ సభ్యులు గండి బాబ్జికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గండి ముత్యాల నాయుడు, శ్యాప్ డైరెక్టర్ పిబివిఎస్ఎన్ రాజు, టిడిపి నాయకులు గండి వంశీ దీప్, భరిణికాన సాయినాథరావు, కోటాన అప్పారావు, గవర అప్పారావు, కోరాడ శ్రీనివాసరావు, దాసరి రమణ, రాజు, వడిసెల రమేష్, బలిరెడ్డి అప్పారావు, గేదల సత్యనారాయణ, గవర సత్యనారాయణ, లెక్కల అప్పలనాయుడు, సాలాపు సూరిబాబు, అంగడి నానాజీ, తమరాన బంగారు నాయుడు, పాల్గొన్నారు.


పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులను సత్కరిస్తున్న గండి బాబ్జీ

## సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-సబ్బవరం : సైబర్ నేరాలు, సామాజిక అంశాలు, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని పరవాడ డిఎస్పి వి.విష్ణు స్వరూప్ అన్నారు. స్థానిక సీతారామ కళ్యాణ మండపంలో శనివారం సబ్బవరం సిఐ రామచంద్రరావు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. యువత చెడు వ్యసనాలు, చెడు అలవాట్లకులోనై వారి బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. తద్వారా దేశం యువశక్తిని కోల్పోతుందని చెప్పారు. ఇలాంటి పరిణామాలు అభివృద్ధిని సామాజిక భద్రతను దెబ్బతీస్తాయన్నారు. కావున ప్రతి ఒక్క విద్యార్థి యువత సామాజిక భద్రతపై అవగాహన కలిగి ఉండాలని, సమాజంలో మంచి చెడుల పట్ల స్పృహ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సింహాచలం, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకర జోన్‌గా లంకెలపాలెం జంక్షన్

**- తరచూ రోడ్డు ప్రమాదాలు**
**- సమస్యగా ఉన్న రహదారి ఎగుడు దిగుడు**

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

విశాఖపట్నం-అనకాపల్లి మార్గంలో ఉన్న లంకెలపాలెం జంక్షన్ ఇప్పుడు ప్రమాద జోన్‌గా మారింది. ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఐదుగురి ప్రాణాలు బలిగొన్న విషయం తెలిసిందే. దాని పర్యవసాన చర్యలు లేకపోతే ముందు ముందు మరిన్ని ప్రమాదాలు తలెత్తే అవకాశాలను కొట్టేయలేం. అసలే ఈ జంక్షన్ రద్దీ కావడంతో ప్రమాదం జరిగితే ఊహ కందని నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

లంకెలపాలెం జంక్షన్‌లో విశాఖ నుంచి అనకాపల్లి వైపు వచ్చే వాహనాలు ఎత్తు నుండి నుంచి కిందకు దిగుతున్నట్లు ఉంటుంది. ఆ సమయంలో నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఎక్కువ ఉంది. అంతేకాకుండా లంకెలపాలెం జంక్షన్ వద్ద రోడ్డు ఎగుడు దిగుడు ఉండటం, హైవే కావడంతో వాహనాలు వేగంగా వెళ్లడం ప్రమాదాలను రెట్టింపు చేస్తోంది. గతంతో పోలిస్తే ఇప్పుడు ఈ ప్రాంతం అత్యంత రద్దీగా మారిపోవడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగిందని చెప్పొచ్చు. పెరిగిన రద్దీకి అనుగుణంగా సరైన నివారణ చర్యలు లేకపోవడం ఆందోళన కలిగించే అంశంగా పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చొరవ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు, సరైన సిగ్నలింగ్, లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం, హెచ్చరిక బోర్డులు పెట్టడం, జంక్షన్‌లో రహదారి ఎగుడు దిగుడులు లేకుండా సమాంతరంగా ఉండే విధంగా చేయడం వంటి చర్యలు చేపట్టాలని పలువురు సూచిస్తున్నారు. దీనికి తోడు మద్యం మత్తులోనూ, అతి వేగంగానూ వాహనాలు నడిపే వారిపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



లంకెలపాలెంలో కంటైనర్ బీభత్సంతో నుజ్జు అయిన కారు (ఫైల్‌ఫోటో)

## 'పాడి రైతులకు అండగా హెరిటేజ్ డెయిరీ'

ప్రజాశక్తి-కశింకోట : హెరిటేజ్ డెయిరీ పాడి రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హెరిటేజ్ సిఇఒ సాంబమూర్తి అన్నారు. కశింకోట గ్రామంలో హెరిటేజ్ పాల సేకరణ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ మిగిలిన డెయిరీలతో పోల్చితే హెరిటేజ్ డెయిరీ ఎక్కువ రేటు చెల్లిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హెరిటేజ్ డెయిరీ జోనల్ మేనేజర్ దివాకర్, రీజనల్ మేనేజర్ పి.తులసి నాయుడు, ఏరియా మేనేజర్ మనోహర్, మేనేజర్ కూండ్రపు శేషు, ఆర్‌వై.నాయుడు, పాడి రైతులు పాల్గొన్నారు.

## మూలపేటలో గ్రామసభ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మూలపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు అధ్యక్షతన ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా గంగఅప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామంలో జాబ్ కార్డు లేనివారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఇటీవల బదిలీ అయిన ఏపీవో ఎరకయ్య, ఈసీ సంధ్య, ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొల్లేటి గంగాధర్, తనిఖీ అధికారి ఎరకయ్య, ఈసీ సంధ్య, ఉప సర్పంచ్ దేవి చంద్ర, కూటమి నాయకులు ఆడారి కాశీరావు, జెకె బ్రదర్స్, భీశెట్టి నాగేశ్వరరావు, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## 'ది రిజిస్ట్రేషన్ బిల్లు'పై పునరాలోచించాలి

ప్రజాశక్తి- సబ్బవరం : ది రిజిస్ట్రేషన్ బిల్లు-2025 అమలుపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని ఏపి రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం సబ్బవరం జాయింట్ సెక్రటరీ శేఖర్ మంత్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని గోటివాడ దరి ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో అనకాపల్లి జిల్లా దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ది రిజిస్ట్రేషన్ బిల్లు 2025 అమలు చేస్తే దస్తావేజు లేఖర్ల జీవనోపాధిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తులకు సంబంధించి ఫిజికల్ డాక్యుమెంట్లు ఉంటేనే ప్రజలు ఆస్తులకు భద్రత కల్పించబడతాయని చెప్పారు. అనంతరం గత పాలకవర్గాన్ని నూతన పాలకవర్గంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చిదంబర స్వామి, ఉపాధ్యక్షులు శేషు, సెక్రటరీ గున్నాజీరావు, జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ, కోశాధికారి రామారావు, మండలాల నాయకులు పాల్గొన్నారు.

## మూడు నెలల బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ కార్మికులకు బకాయి పడ్డ మూడు నెలల జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కు పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు వైఎన్.భద్రం, గనిశెట్టి యేసుదాసు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు చెల్లించకుంటే కార్మిక కుటుంబాలు ఏం తిని బతుకుతాయని ప్రశ్నించారు. 15 రోజుల్లో చెల్లించాలని, లేకుంటే విధులు బహిష్కరించి సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. కలిగొట్ల నాయుడు, మల్ల జోగారావు, కె సత్యనారాయణ, సిహెచ్ రమణ, జయలక్ష్మి, ఎస్ రత్నం, చెట్ల లక్ష్మి, వెవేటి నాగేష్, చేవ్వేటి నేస్తాలు, మంగ పాల్గొన్నారు.

## రోడ్డు మధ్యలో రంధ్రం

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట : నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా వుండే కశింకోట -బంగారుమెట్ట రోడ్డులో దొంగలమర్రి చెట్టు వద్ద నర్సరీకి సమీపంలో ఉన్న మధుముకి కన్నం పడింది. సదరు కన్నంపై కర్రకు గుడ్డకట్టి ప్రమాదం జరుగకుండా వాహనదారులు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు గుండా ప్రతి రోజు అధిక సంఖ్యలో మాడుగుల, పాడేరు తదితర ప్రాంతాల నుండి వాహనాలు రాకపోకలు జరుగుతున్నాయి. సదరు కన్నం పెరిగితే ఇబ్బందులు ఏర్పడతాయని, తక్షణమే దానికి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

## రేపు కలెక్టరేట్ వద్ద గీత కార్మికుల నిరసన

ప్రజాశక్తి-కశింకోట : బెల్ట్ షాపులు ఎత్తి వేయాలని కోరుతూ ఈ నెల 14న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు గీత కార్మికులు నిరసన కార్యక్రమం చేస్తున్నట్లు ఏపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రా దేముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గీత కార్మికులందరూ ఈ నిరసన కార్యక్రమానికి మోకు, మోస్తాదుతో రావాలని కోరారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు ఉండడం వల్ల గీత కార్మికులకు నష్టం వాటిల్లుతుందని, అందువల్ల గ్రామాల్లో ఉన్న బెల్ట్ షాపులు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. 14న జరుగు కార్యక్రమానికి పెద్ద ఎత్తున గీత కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## పొదుపు సంఘం నిర్వాహకుల మధ్య వివాదం

**సభ్య మహిళల్లో తీవ్ర ఆందోళన**

ప్రజాశక్తి-చోడవరం

పొదుపు సంఘం నిర్వాహకుల మధ్యన తలెత్తిన వివాదంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పొదుపు సంఘం మహిళలలో తీవ్ర ఆందోళన నెలకొంది. కసింకోట రాజు, సిరసపల్లి కృష్ణవేణి, కోరుకొండ లక్ష్మి అనే ముగ్గురు వికాస మ్యాక్స్ సంస్థ నుండి విడిపోయి మహిళ మ్యూచువల్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ క్రెడిట్ సొసైటీ పేరుతో పొదుపు సంఘాన్ని ఏర్పాటు చేశారు ఆరేళ్లగా నిర్వహిస్తున్న సంఘంలో సుమారు మూడు కోట్ల రూపాయల వరకు మహిళలు పొదుపు చేశారు. రుణాలతో పాటు మూడు కోట్ల వరకు వార్షిక టర్నోవర్ జరుగుతుంది. వీరు ముగ్గురు కొంతకాలం సంఘ కార్యకలాపాలు నిర్వహించేవారు. వీరితోపాటు పదిమంది డైరెక్టర్లుగా ఉండేవారు. కొంతకాలం తరువాత కశింకోట రాజు, కష్ణవేణు కలిసి కోరుకొండ లక్ష్మిని సంఘం తొలగించారు. అనంతరం సంఘం నిర్వహణలో రాజు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారని, సరిగా లెక్కల చెప్పకపోవడం, ఆడిట్ జరగకపోవడం, లెక్కలు అడిగితే సరిగా సమాధానం చెప్పకపోవడం వల్ల సొసైటీకి నష్టం జరుగుతుందని సిరసపల్లి కృష్ణవేణి, మరో డైరెక్టర్ లింగంపల్లి పద్మ పోలీసు స్టేషన్‌లో కశింకోట రాజుపై పది రోజులు క్రితం ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ అప్పలరాజు ఆధ్వర్యంలో సంఘం భవనానికి తాళాలు వేసి రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది. సంఘంలో జరుగుతున్న గొడవ సభ్యులకు తెలియడంతో తాము పొదుపు చేసుకున్న నగదు ఎక్కడ పోతుందోనని భయంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం సంఘంలో 2500 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. గతంలో చోడవరంలో అనేక ఫైనాన్స్ సంస్థలు ఏర్పాటై అనతి కాలంలోనే నీటి బుడగల్లా మాయమవడంతో మహిళలు మరింత ఆందోళన చెందుతున్నారు.

## అండర్ బ్రిడ్జి వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక అండర్ బ్రిడ్జి వద్ద తగిన పటిష్ట చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతూ వైసిపి ఆధ్వర్యంలో శనివారం రైల్వే శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 17న భారీ క్వారీ లారీ లోడుతో వచ్చి అక్కడ గడ్డర్లను ఢీకొట్టడం, తద్వారా రైల్వే ట్రాక్ దెబ్బతినడం జరిగిందని గుర్తు చేశారు. త్రుటిలో పెను ప్రమాదం తప్పిందన్నారు. తిరిగి ఈనెల 10న గడ్డర్లు పడిపోయే పరిస్థితి గమనించిన స్థానికులు రైల్వే శాఖ అధికారుల దృష్టికి తేవడం జరిగిందని తెలిపారు. వాటిని కూడా రైల్వే శాఖ మరమ్మతులు చేపట్టారని కోరారు. భారీ వాహనాల రాకపోకలపై నియంత్రణ లేకపోవడంతో ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, నాయకులు కొణతాల మురళీకృష్ణ, కేయం నాయుడు, జాజుల రమేష్, బొడ్డేడ శివ, దాడి నారాయణరావు, గైపూరి రాజు, మరిపల్లి శోభ, ఉగ్గిన అప్పారావు పాల్గొన్నారు.

## జన్మదినం సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన పట్నాల శ్రీవిద్య(11) జన్మదినం సందర్భంగా శనివారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శ్రీవిద్య తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శ్రీవిద్యకు 2వ ఏట నుండే ప్రతి సంవత్సరం జన్మదినం సందర్భంగా కుమార్తె కోరిక మేరకు తల్లిదండ్రులు నిరుపేదలకు అన్నదానం చేస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం శ్రీవిద్య పుట్టిన రోజు సందర్భంగా శ్రీవిద్య తల్లిదండ్రులు బిర్యాని, బిస్కరి, మంచినీళ్ల బాటిల్ కలిపి పార్శిల్ చేసి మునగపాక పరిసర ప్రాంత పేదలకు, రోడ్డుపక్క అనాథలకు శ్రీవిద్య చేతుల మీదుగా పంపిణీ చేశారు.

# పలు ప్రాంతాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'



మహిళకు కరపత్రం అందిస్తున్న టిడిపి నేత సాయికృష్ణ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని నరేంద్రపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆ పార్టీ నాయకులు గడపగడపకు వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమర శెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**అచ్యుతాపురం :** మండలంలోని ఎం జగన్నాధపురం గ్రామంలో శనివారం ఉదయం రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు తదితరులు ఇంటింటి ప్రచారం చేశారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రగడ నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పీలా తులసిరాము, నాయకులు పి.చిన్నయ్య నాయుడు, భీమరశెట్టి శ్రీనివాసరావు, మామిడి శివ అప్పారావు, గొతు రాంబాబు, సేనాపతి వెంకటేష్, వీసం నానాజీ పాల్గొన్నారు.

**అనకాపల్లి :** జీవీఎంసీ 80వ వార్డు 232 బూత్ కర్రివారి వీధి, పిళ్ళావారివీధి ప్రాంతంలో బూత్ కన్వీనర్ బొడ్డేడ మురళి ఆధ్వర్యంలో ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి సన్యాసి అప్పారావు, కర్రి రామకృష్ణ పాల్గొన్నారు.

**అనకాపల్లి రూరల్ :** జీవీఎంసీ 82వ వార్డు నరసింగరావు పేట, బర్మా కాలనీ ప్రాంతాలలో సువరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**భీమునిపట్నం :** జివిఎంసి మూడో వార్డు రెల్లి వీధిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు కె నాగరాజు, కె గురుమూర్తి, ఎం సంజీవ్ కుమార్, వి సత్యారావు, కొక్కిరి అప్పన్న పాల్గొన్నారు. రెండో వార్డు ఆదర్శనగర్‌లో వార్డు నాయకులు చెట్టి అశోక్ చక్రవర్తి, పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**సీతమ్మధార :** జివిఎంసి 26వ వార్డు రామకృష్ణా నగర్, రజక వీధిలో వార్డు కార్పొరేటర్ ముక్క శ్రావణి సుపరి పరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు, ప్రజాసమస్యలపై వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేశారు. వార్డు అధ్యక్షులు ముక్కా కిషోర్ కుమార్, ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాసు, బూత్ కన్వీనర్ వరలక్ష్మి దేవి పాల్గొన్నారు.



సీతమ్మధారలో ఇంటింటికీ టిడిపిలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రావణి

**ములగాడ :** జీవిఎంసి 58వ వార్డు శ్రీహరిపురం పాత రామాలయం నుంచి గుల్లలపాలెం వరకు వార్డు అధ్యక్షులు కోరాడ శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ పోతాబత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుపరిపాలనకు తొలిఅడుగులో ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ పి.గణబాబు, నియోజకవర్గ పరిశీలకులు రంగనాయకులు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనపై వివరించి, సమస్యలు తెలుసుకున్నారు. మాజీ కార్పొరేటర్ శిరం ఉమామహేశ్వరి, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సిహెచ్ రామ్మోహన్ నాయుడ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

## శ్రీ ప్రకాష్‌లో వర్క్‌షాప్

ప్రజాశక్తి-పాయకరావుపేట:పట్టణంలోని శ్రీ ప్రకాష్ అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో డిపార్టుమెంటు ఆఫ్ జువాలజీ ఆధ్వర్యంలో గో ఆధారిత ఉత్పత్తులపై రెండు రోజుల వర్క్ షాప్ జరిగింది. గో పూజతో ప్రారంభమైన ఈ వర్క్ షాప్ లో పంచగవ్య ఉత్పత్తులు, గో ఆధారిత వ్యవసాయ పద్ధతులు, ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. 20 రకాల ఉత్పత్తులను తయారు చేసే విధానాన్ని ఈ వర్క్ షాప్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షకులు - క్షేత్ర గో సేవ సంయోజక్ ఆకు తోట రామారావు మాట్లాడుతూ... గో ఆధారిత ఉత్పత్తుల ఉపయోగించడంతో ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రాంత గో సేవ సంయోజక్ రాంజీ, ఆంధ్ర ప్రాంత గో సేవ సహ సంయోజక్ ఓలేటి నారాయణ కుమార్, స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ రెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



## ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా. జి.శారద కుమారి ( ఎఫ్ఏసి )బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన శారదా కుమారిని డిఇ ఈశ్వరరావు, ఏఈ నరసింగరావు ఆఫీసు సిబ్బంది తదితరులు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు.



## రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట బస్ స్టేషన్ కు ఎట్టకేలకు సీసీ రోడ్డు మోక్షం లభించింది. శనివారం సాయంత్రం ఈ పనులకు శ్రీకారం చుట్టారు. గత కొంత కాలంగా బస్టాండ్ ఆవరణ గోతులమయం కావడంతో వర్షం పడినప్పుడల్లా ప్రయాణికులు అవస్థలు పడేవారు. స్పీకర్ అయ్యన్న చొరవతో బస్ స్టేషన్ ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణంకు మార్గం సుగమనమైంది. ప్రస్తుతం కాంప్లెక్స్ ఆవరణను జేసీబితో చదును చేస్తున్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

## స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్: వేసవి కాలంలో నర్సీపట్నం నియోజకవర్గంలోని గ్రామాలలో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. నర్సీపట్నం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్, అనకాపల్లి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.రామస్వామి, డిప్యూటీ ఇంజినీర్ ఎం. జయరామ్‌తో పాటు నాలుగు మండలాలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, నర్సీపట్నం, మాకవరపాలెం, నాతవరం, గొలుగొండ మండలాల్లోని ప్రతి గ్రామంలో తాగునీటి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించాలని, తక్షణమే సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి ప్రాధాన్యతననుసరించి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. తక్షణ చర్యల ద్వారా వేసవి నాటికి తాగునీటి సమస్యలు తలెత్తకుండా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం నుండి అవసరమైన నిధులను తీసుకురావడానికి జిల్లా కలెక్టర్‌తో సంప్రదింపులు



మాట్లాడుతున్న స్పీకర్

చేస్తామని తెలిపారు. నీటి నిల్వలు తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు. సమీక్షలో పాల్గొన్న అధికారులు ప్రతి గ్రామ స్థాయిలో నివేదికలు తయారు చేసి తక్షణమే చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నాలుగు మండలాల అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

# సత్యవరంలో ఘరానా మోసం

-రూ.30 కోట్లతో పరారైన వెంకటేశ్వరావు

-లబోదిబోమంటున్న బాధితులు



బ్రాండ్ పేపర్లను చూపుతున్న బాధితులు

ప్రజాశక్తి-పాయకరావుపేట:మండలంలోని సత్యవరంలో ప్రజలను నమ్మించి సుమారు 30 కోట్ల రూపాయలతో పరారైన పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు సంఘటన సంచలనంగా మారింది. అతనిపై నమ్మకంతో అప్పులు ఇచ్చిన సుమారు 200 మంది బాధితులు ప్రస్తుతం లబోదిబోమంటున్నారు. ఈ సంఘటనకు సంబంధించి పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు చేతిలో మోసపోయిన బాధితులు శ్రీను, వర్మ రాజు, తదితరులతో పాటు బాధిత మహిళలు అందించిన సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సత్యవరం గ్రామంలో సుమారు 30 ఏళ్లుగా పెదిరెడ్డి వెంకటేశ్వరరావు ఫైనాన్స్ వ్యాపారం, తునిలో శ్రీనివాస జ్యువెలరీ పేరుతో బంగారం షాపు నడుపుతూ సత్యవరంతోపాటూ పరిసర గ్రామాలలో ప్రజలలో ఎంతో నమ్మకం ఏర్పాటు చేసుకున్నాడు. ప్రజలకు వడ్డీకి సొమ్ములు ఇచ్చి మొదట వడ్డీ సొమ్ములు వసూలు చేసుకుంటూ జీవనం సాగించి, కాలక్రమేనా జనం దగ్గర వడ్డీకి డబ్బులు తీసుకుని వారికి నెలల వడ్డీలు చెల్లిస్తూ వారిలో నమ్మకం ఏర్పరుచుకున్నాడు వడ్డీకి తీసుకున్న సొమ్ము బంగారం షాపులో పెట్టుబడిగా పెడుతున్నట్లు నమ్మబలికాడు. దీంతో సుమారు 200 మంది 15 నుంచి 30 కోట్ల రూపాయల వరకు అప్పుగా ఇచ్చారు. సత్యవరం గ్రామంలో వెంకటేశ్వరరావు గత పది రోజుల నుంచి ఇంటికి తాళం వేసి ఊళ్ళోకి రావడం మానేశాడు బంగారు షాప్ కూడా తీయడం మానేశాడు.దీంతో బాధితులు లబోదిమంటూ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

## గంజాయి జోలికి వెళ్లొద్దు

ప్రజాశక్తి-గొలుగొండ:గంజాయి ఒక మహమ్మారీ అని, దానిజోలికి వెళితే జీవితాలు నాశనం అవుతాయని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ అన్నారు. శనివారం సాయంత్రం గొలుగొండ మండలం రావణాపల్లి గ్రామంలో ఎస్ఐ రామారావుతో కలిసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గంజాయితో కుటుంబాలు చిధ్రమౌతా యన్నారు. గంజాయి కేసుల్లో ఇరుక్కొని తమ బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న సిఐ రేవతమ్మ



పరీక్షలు చేస్తున్న వైద్యులు

## ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - రావికమతం: మండలంలో చీమలపాడు పంచాయతీ శివారు ములకలపల్లి గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చీమలపాడు పంచాయతీ శివారు ములకలపల్లి గ్రామంలో సంచార చికిత్స ప్రోగ్రాం లో భాగంగా వైద్యాధికారిణి సురేఖ పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి 35 మంది హాజరు కాగా అందులో పది మందికి ఆర్టిటి కిస్టులతో పరీక్షలు నిర్వహించారు. ఇద్దరుకు మలేరియా పాజిటివ్ ఉన్నట్లు వైద్యుల గుర్తించి వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేఖ, ప్రాథమిక ఆరోగ్య విస్తరణ అధికారి రామారావులు మాట్లాడుతూ, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచిన నీటిని తాగాలన్నారు.ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రమణమ్మ, ఎం ఎల్ హెచ్ పి జోష్ని ,హెల్త్ అసిస్టెంట్ గోవిందు, ఏఎన్ఎం ఉషారాణి ,ఆశాలు పాల్గొన్నారు.

## ధర్మశ్రీ నియామకంపై హర్షం

ప్రజాశక్తి-రావికమతం:చోడవరం మాజీ శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ ఎలమంచిలి నియోజకవర్గం సమన్వయకర్తగా నియామకం కావడం పట్ల రావికమతం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కా మహాలక్ష్మి నాయుడు, ఎంపీపీ పైలరాజు, మండల కన్వీనర్ కంచిపాటి జగన్నాధరావు, మాజీ డిసిసిబి డైరెక్టర్ సత్యదేవ, కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధర్మశ్రీ నాయకత్వాన్ని, ఆయన సేవలను గుర్తించి అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం ఇన్చార్జిగా, ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నేత ధర్మశ్రీ అని కొనియాడారు.



ఆర్థిక సాయం అందజేసిన ఉపాధి శ్రామికులు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో చందనాడ గ్రామానికి చెందిన దారా సూకరాజు రెండు నెలల క్రితం కొబ్బరి చెట్టుపై నుండి జారి పడడంతో రెండు కాళ్ళు విరిగిపోయి, వెన్నుముఖ దెబ్బతింది. ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి రావడంతో శనివారం ఆ గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న శ్రామికులంతా కలిసి 15 వేల రూపాయలు నగదు, 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో పుణ్యమంతుల సత్తిబాబు, నానాజీ, రమణ, సూకరాజు, రత్నాలు, ఈశ్వరమ్మ, నాగమణి పాల్గొన్నారు.

# 3 సెంట్ల స్థలంలో ఇల్లు కట్టిస్తాం

## - హోంమంత్రి వంగలపూడి అనిత



కల్వర్టుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అనిత

ప్రజాశక్తి - నక్కపల్లి:మండలంలో అమలాపురం గ్రామంలో ఒక్కొక్క ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు నివాసం ఉన్నారని, ఇల్లు సరిపోక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఇల్లులు లేని వారిని గుర్తించి 3 సెంట్లు స్థలం కేటాయించి ఇల్లులు కట్టిస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలో అమలాపురంలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. కనకమహాలక్ష్మి అమ్మవారిని హోం మంత్రి దర్శించుకున్నారు. అనంతరం హోం మంత్రి అనిత ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఒక ఇంట్లో రెండు మూడు కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నామని, ఇల్లు సరిపోక చాలా ఇబ్బందులు పడుతున్నామని, ఇల్లులు మంజూరు చేయాలని పలువురు మహిళలు హోంమంత్రి అనితను కోరారు. ఇల్లు లేని వారికి 3 సెంట్ల స్థలం ఇచ్చి ఇళ్ల కట్టిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కల్వర్టుకు శంకుస్థాపన చేశారు. ప్రజలతో ముఖాముఖీ సమావేశంలో పాల్గొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ,ఎంతమంది పిల్లలు ఉన్నా, తల్లికి వందనం ఇచ్చామన్నారు. ఇప్పటికే రెండు గ్యాస్ సిలిండర్లు అందించామని గుర్తుచేశారు.అమలాపురం గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు తాము వేసినవేనని పేర్కొన్నారు. గ్రామ పరిశుభ్రతపై దష్టి పెట్టాలని, గ్రామం పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. భూ సేకరణలో భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేస్తామని, ఎలాంటి అపోహలు వద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశం అనంతరం ఓ పాపకు ఫ్యాన్ తగిలి విద్యుత్ షాక్‌కు గురైంది. అంతా అప్రమత్తం అవ్వడంతో ముప్పు తప్పింది. హోంమంత్రి పాప పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, టిడిపి మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, మహిళా అధ్యక్షురాలు పాతిమా మున్నీషా, మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవర సత్యనారాయణ,గ్రామ సర్పంచ్ శంకర్రావు, నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, నరసింగరావు, అప్పలరాజు, గోవిందరావు, సత్తిబాబు, గోపి, రాజు,సత్యం, జోగులు, కళ్యాణ్, బాబ్జి, శ్రీను, ప్రసాద్, నానాజీ పాల్గొన్నారు.

## అంధకారంలో ఎరకన్నపాలెం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండలంలో ఎరకన్నపాలెం గ్రామంలో వీధి లైట్లు వెలుగ లేదు. దీంతో గ్రామ ప్రజలు అంధకారంలో మగ్గి పోతున్నారు. కొన్ని రోజులుగా గ్రామంలో వీధిలైట్లు వెలగ లేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే అధికారులకు ఫోన్లు చేసినప్పటికే స్పందించ లేదని గ్రామస్తులు తెలిపారు. రాత్రి సమయంలో వీధిలోకి వెళ్లాలంటే విద్యార్థులు, రైతులు, ఉద్యోగస్తులు చీకటి ప్రాంతంలో వెళ్లాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



అంధకారంలో గ్రామం



లైన్‌మ్యాన్‌ను నిలదీస్తున్న గ్రామస్తులు

## లైన్‌మ్యాన్‌ను నిలదీసిన గ్రామస్తులు

**ప్రజాశక్తి- చీడికాడ:**48 గంటల నుండి కరెంటు సరఫరా లేకపోవడంపై గ్రామానికి సంబంధించిన విద్యుత్ లైన్మెన్‌ను గ్రామస్తులు నిలదీశారు. మండలంలోని అప్పలరాజు పురం గ్రామంలో ఎస్సీ కాలనీకి గత 48 గంటల నుండి కరెంటు లేదని స్థానికులు తెలిపారు. కాలనీకి చెందిన ట్రాన్స్ఫార్మర్ కాలి పోవడంతో సంబంధిత విద్యుత్ లైన్ మాన్ కి ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం బాధ్యత యుతంగా వ్యవహరించలేదని వారు వాపోయారు. కాలనీకి చెందిన ప్రజలు లైన్మెన్‌తో వాగ్వాదానికి దిగారు. గత రెండు రోజులుగా కరెంటు లేనందున చిన్న పిల్లలతో దోమల బెడదతో నిద్రలేక నివసిస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ ఎందుకు పట్టించుకోలేదని లైన్మెన్‌ను నిలదీశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్ఫార్మర్ బిగించి ఎస్సీ కాలనీకి పవర్ సప్లై వచ్చేలా చూస్తారని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గొర్లి సత్యనారాయణ, అప్పీయమ్మ, వరహాలమ్మ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## 14న కలెక్టరేట్ వద్ద ధర్నా

**ప్రజాశక్తి- మాడుగుల:**విచ్చల విడిగా ఏర్పాటు చేసిన బెల్ట్ షాపులను తక్షణమే తొలగించి గీత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తు ఈ నెల 14 తేదీ సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కల్లుగీత కార్మిక సంఘం చీడికాడ మాడుగుల మండలాల కేజే పురం సొసైటీ అధ్యక్షులు దొడ్డి నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ హయాంలో అక్రమ మద్యం ఏరులై పారుతుందన్నారు. బెల్ట్ షాపులు విపరీతంగా పెట్టారన్నారు. దీంతో కల్లు అమ్మకాలు లేకుండా గీత కార్మిక కుటుంబాలు ఆర్ధికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. కల్లు గీత సోదరులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# స్మార్ట్ మీటర్లను బిగించొద్దు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** అల్లూరు సీతారామరాజు విజ్ఞాన కేంద్రం రోడ్ ఆయిల్ మిల్లు సందులో స్మార్ట్ మీటర్లువల్ల జరిగే నష్టాలను ప్రజలకు తెలియజేస్తూ, ఇంటింటికీ స్టిక్కర్లు, పోస్టర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్, ముఠా కళాశీలు పాల్గొన్నారు.

**గోపాలపట్నం :** ఆదాని స్మార్ట్ విద్యుత్ మీటర్లను తిరస్కరించాలని కోరుతూ సిపిఎం గోపాలపట్నం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో 91వ వార్డు ఇందిరానగర్‌లో పాదయాత్ర నిర్వహించారుకార్యక్రమంలో సిపిఎం నాయకులు సాంబమూర్తి నగేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

### స్మార్ట్ మీటర్లను తొలగించాలి
### సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు
### చిరు వ్యాపారికి రూ.63,996ల విద్యుత్ బిల్లుపై నిరసన

**నక్కపల్లి:**ఆదానీ ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు షాపులకు బిగించడం వల్ల అధిక విద్యుత్ బిల్లుల భారం పడుతుందని, వ్యాపారులు విద్యుత్ బిల్లులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జీ.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు తెలిపారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో గోల్డెన్ బేకరీ షాపు కు గత ఆరు నెలలు క్రితం విద్యుత్ ప్రీపైడ్ స్మార్ట్ మీటర్ బిగించారు. అప్పటి నుండి విద్యుత్ బిల్లు అధికంగా రావడంతో షాపు యజమాని విద్యుత్ బిల్లు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాడు. ప్రస్తుతం విద్యుత్ బిల్లు 63,996 రూపాయలు వచ్చిందని, ఇంత భారీగా విద్యుత్ బిల్లు వస్తే ఎలా చెల్లించాలని షాప్ యజమాని ఆవేదన వెలిబుచ్చారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జీ.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్, రాజయ్యపేట శాఖ కార్యదర్శి ఎం.మహేష్ బాబు శనివారం బేకరీ షాప్ వద్దకు వచ్చి, యజమానికి అండగా నిలిచి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వ్యాపార సంస్థలకు అదానీ, షిరిడీ సాయి ఎలక్ట్రికల్ సంస్థ తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారని, దీని కారణంగా వేల రూపాయల విద్యుత్ బిల్లులు వస్తున్నాయని తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించ లేక చిరు వ్యాపారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడా కాశీరావు, ఎం. బైరాగిరాజు, ఎం.బాపూజీ, ఎం.జాన్, వై.అప్పారావు పాల్గొన్నారు.

**యస్.రాయవరం:**మండలంలోని పెదగు మ్మలూరు గ్రామంలో స్మార్ట్ మీటర్‌లు బిగించొద్దని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ, కూటమీ ప్రభుత్వం అధికారంలో రాక మునుపు స్మార్ట్ మీటర్లు బిగిస్తే బూడిది చేయమని చెప్పిన విద్యాశాఖ మంత్రి లోకేష్ అధికారంలోకి వచ్చి వాటిన్ని బిగించే కార్యక్రమం చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో పెద్ద గుమ్మలూరు గ్రామస్తులు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న రైతులు, నాయకులు




మాట్లాడుతున్న జగ్గునాయుడు

### అదానీ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించండి
### పాదయాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు.

**ప్రజాశక్తి -గాజువాక :** అదానీ స్మార్ట్‌మీటర్లతో విద్యుత్ వినియోగదారులపై మోయలేని భారం పడుతుందనిసిపిఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు వద్దని కోరుతూ, 76వ వార్డు రిక్షా కాలనీ, రామచంద్ర నగర్‌లో శనివారం సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో రెండు కోట్ల మీటర్ల ఏర్పాటుకు అదానీ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని ఈ మేరకు మీటర్ల ఏర్పాటు ద్వారానే ప్రజలపై రూ.25వేల కోట్ల భారం వేయనున్నారన్నారు. సింగిల్ ఫేజ్ మీటరకు రూ. 8,927, త్రీఫేజ్‌కు రూ.17,286లను 93 నెలల్లో వాయిదాల పద్ధతిన వినియోగదారుల నుంచి వసూలు చేస్తారన్నారు.
గాజువాక జోన్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ ఏడాదిలో సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.15,485 కోట్లు భారం కూటమి ప్రభుత్వం ౹జలపై వేసిందన్నారు.కార్యక్రమంలో డి రమణ, బి రమణ, రాజారావు ,సుదర్శన్ రావు, అర్జున్ రావు, త్రినాధ రావు, శంకర్రావు రాము పాల్గొన్నారు..

**పెందుర్తి:** అదానీ ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించకుండా గృహవినియోగదారులంతా తిరస్కరిం చాలని సిపిఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి జగన్ పిలుపు నిచ్చారు. 97వ వార్డు కార్మిక నగర్‌లో ప్రజాసమస్యలపై సిపిఎం పాదయాత్రలో మాట్లాడారు. సిపిఎం సీనియర్ నాయకురాలు బి. రమణి మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణ అమలు చేసిన వైసిపిని ప్రజలు పక్కన పెట్టారని, ఆదే బాటలో నడుస్తున్న కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. పార్టీ జోన్ నాయకులు బి వెంకట్రావు, కె.అప్పలనాయుడు గ్రామ నాయకులు రామారావు, ఈశ్వర్ రావు, నాయుడు, గోపి, ఈశ్వరరావు, మహేష్, రాజు, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

## నేడు సంజీవిని ఆసుపత్రి ప్రారంభం

**ప్రజాశక్తి- రావికమతం:**మండల కేంద్రంలో నూతన నంగా ఏర్పాటు చేసిన సంజీవిని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఈనెల 13న ప్రారంభానికి సిద్ధమైంది. ఈ ఆసుపత్రిను చోడవరం శాసనసభ్యులు కేయస్ఎన్ఎల్ రాజు చైతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగు తుందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చోడవరం నుండి నర్సీపట్నం వెళ్లే మెయిన్ రోడ్ లో శ్రీ వెంకటేశ్వర థియేటర్ సమీపంలో ఏర్పాటు చేసిన సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని హాస్పటల్ లో నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

## స్వాతి షాపింగ్ మాల్ ప్రారంభం

### -సందడి చేసిన హీరోయిన్ శ్రీ లీల

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** జగదాంబ జంక్షన్‌లో స్వాతి షాపింగ్ మాల్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. మేయర్ పీలా శ్రీనివాసరావు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సంయుక్తంగా ఈ మాల్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ సినీ నటి శ్రీలీల షాపింగ్ మాల్‌లో కలియ తిరుగుతూ వస్త్రాల నాణ్యతను పరిశీలించారు. తక్కువ ధరలో నాణ్యత ఎక్కువ ఉందంటూ నిర్వాహకుల్ని కొనియాడారు. అనంతరం అగ్గి పెట్టి చీరను అవిష్కరించారు. ఫ్యామిలీ మొత్తం ఒకే చోట తక్కువ ధరల్లో నాణ్యమైన వస్త్రాలను అందించడం స్వాతి షాపింగ్ మాల్ ప్రత్యేకత అంటూ యాజమాన్యాన్ని అభినందించారు. అభిమానులకు అభివాదం చేశారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, స్వాతి షాపింగ్ మాల్ వంటి ప్రముఖ వస్త్ర దుకాణం తమ నియోజకవర్గంలోని జగదాంబ జంక్షన్‌లో ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్నారు. విశాఖ నగరం వ్యాపారాలకు అనువైన కేంద్రం అన్నారు. వ్యాపారస్తులకు ఇబ్బందులు కలగకుండా, సజావుగా వారి వ్యాపారాలు సాగేందుకు కూటమి ప్రభుత్వం సహకారం అందిస్తుందని చెప్పారు. షాపింగ్ మాల్స్ ఏర్పాటు వల్ల పలువురికి ఉపాధి లభిస్తుందని, నగరం అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

సంస్థ అధినేత రమణబాబు మాట్లాడుతూ, నాలుగు తరాలుగా వస్త్ర వ్యాపార రంగంలో సేవలందిస్తున్నామని, 50 ఏళ్లుగా ఎవరూ చేయని విధంగా అగ్గిపెట్టెలో ఆరు గజాల పట్టు చీర తయారు చేస్తున్నట్టు తెలిపారు. అందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన దుస్తులతో పాటు అనేక వెరైటీలతో సరసమైన ధరలకే అందించటం తమ ప్రత్యేకత అన్నారు. షాపింగ్ మాల్ ప్రయివేటు మార్గం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై సినీనటి శ్రీలీల కొంతసేపు సందడి చేశారు. ఆమెను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, బిజెపి నగర అధ్యక్షులు పరుశరామరాజు, కార్పొరేటర్లు బిపిన్ కుమార్ జైన్, కోడూరు అప్పలరత్నం, మాసిపోగు రాజు, యజ్ఞశ్రీ పాల్గొన్నారు.



స్వాతి షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



సెల్ఫీతో సందడి చేస్తున్న సినీ హీరోయిన్ శ్రీలీల